2.49లక్షల మందికి ₹2,761 కోట్లు

రైతుల ఇంట సిరుల పంట

- వానకాలంలో రికార్డు స్థాయిలో వరి దిగుబడి
- సూర్యాపేట జిల్లాలో 10,58,290 మెట్రిక్ టన్నుల ధాన్యం రాక
- రైతుల చేతికి రూ.2,546 కోట్లు.. రైతు బంధు ద్వారా మరో రూ.215 కోట్లు

అర్వపల్లి మండలం బొల్లంపల్లి ఐకేపీ కేంద్రంలో ధాన్యం ఆరబోస్తున్న రైతులు

సూర్యాపేట, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : చెరువులు బాగుపడడం.. సరిపడా వర్షాలు కురువడం.. నాగార్జునసాగర్, మూసీ, కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు రావడంతో సూర్యాపేట జిల్లాలో వరి సాగు గణనీయంగా పెరిగింది. దాంతో రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో పంట పండింది. ఫలితంగా వరుసగా ఆరేండ్ల మాదిరిగా ఈ వానకాలంలో కూడా రైతన్నల జేబులు డబ్బులతో గలగలలాడుతున్నాయి. జిల్లాలోని 2.49లక్షల మంది వరి సాగు చేసిన రైతుల చేతికి ఈ ఒక్క సీజన్‌లోనే 2,761 కోట్ల రూపాయలు అందాయి. జిల్లా వ్యాప్తంగా 4,31,730 ఎకరాల్లో వరి సాగు చేయగా రూ.2,546 కోట్ల విలువ చేసే 10,58,290 మెట్రిక్ టన్నుల పంట పండింది. సీజన్‌కు ముందే పంట పెట్టుబడి సాయం కింద జిల్లా రైతుల అకౌంట్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.215 కోట్లు జమ చేసింది.

ఆరుగాలం కష్టించే రైతన్న ఉమ్మడి రాష్ట్రంలో అన్ని రంగాల్లో నష్టపోవడం పరిపాటిగా ఉండేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం రైతన్న మోములు చిరునవ్వులు చిందించేలా అనేక పథకాలు అమలవుతూ వచ్చాయి. సాగునీటిని అందించేందుకు ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టగా.. నిరంతర ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయం అందించడం, విత్తనాలు అందుబాటులో ఉంచడంతోపాటు రైతులకు సూచనలు చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ శాఖను బలోపేతం చేసింది. ప్రతి ఐదు వేల హెక్టార్లకు ఒక ఏఈఓను నియమించింది. ప్రభుత్వం ఈ స్థాయిలో రైతులు, వ్యవసాయానికి చేయూత ఇవ్వగా అధికారులు, వ్యాపారులో గతంతో పోల్చితే మార్పు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వమే ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసింది. దీంతో వ్యాపారులు సైతం తమ లాభాలను కొంత తగ్గించుకొని రైతుల నుంచి మద్దతు ధరకు మించి చెల్లించి దాన్యం కొనుగోలు చేస్తున్నారు. వానకాలంలో వర్షాలు పుష్కలంగా కురువడంతోపాటు నాగార్జునసాగర్, మూసీ నదుల్లో సరిపడా నీళ్లు ఉండగా.. కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు వచ్చాయి. దీంతో జిల్లాలో ఎక్కడా గుంట వదలకుండా వరి పొలం సేశారు.

ఒక్క సీజన్‌లోనే రైతులకు రూ.2,761 కోట్లు

వానకాలం సీజన్‌లో జిల్లా రైతుల జేబుల్లోకి పంట పెట్టుబడి సాయం రూ.215 కోట్లు, పండించిన పంటకు రూ.2,546 కోట్లు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 4,31,730 ఎకరాల్లో వరి సాగు చేయగా.. దాదాపు 10,58,290 మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాకు రూ.2,203 మద్దతు ధర చెల్లిస్తున్నది. బహిరంగ మార్కెట్‌లో సన్న రకాలకు రూ.2700 నుంచి 2900 రూపాయల వరకు వెచ్చించి వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇందులో సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో రూ.1,396 కోట్ల విలువ చేసే 6,34,974 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలోని ఐదు వ్యవసాయ మార్కెట్లు, ప్రైవేట్ రైస్ మిల్లర్లు రూ.1150 కోట్ల విలువ చేసే 4,23,316 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. కాగా, జిల్లాలో వానకాలం పంటల కొనుగోళ్లు దాదాపు 95 శాతం పూర్తయ్యాయి.

వానకాలం పంటకు రెండు లక్షలు వచ్చినయి..

తెలంగాణ రాష్ట్రం రాక ముందు కాల్వల్లో కంపచెట్లు మొలిచి పూడిపోయాయి. నీళ్లు వస్తాయో, రావోనని అనుకునే వాడిని. ఎన్నో బోర్లు వేసి ఇబ్బందుల పాలయ్యాను. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి గతంలో తవ్వని కాల్వల గుండా గోదావరి జలాలను మళ్లించారు. అన్ని చెరువులు నింపడంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లల్లో నీళ్లు పైకి వచ్చాయి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రెండు పంటలకు పెట్టుబడి సాయం అందించారు. నాకున్న ఆరు ఎకరాలకు రైతుబంధు డబ్బులు రూ.30వేలు బ్యాంకుకులో జమ అయ్యాయి. పంట బాగా పండడంతో వానకాలం వడ్లకు రెండు లక్షల రూపాయలు వచ్చాయి. రైతుల కోసం ఇంత మంచి చేసిన కేసీఆర్‌ను ఎప్పటికీ మరువం. ఆయన త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఉండాలి.

– దోమల బాలమల్లు, రైతు, నాగారంబంగ్లా, నాగారం మండలం

వంద క్వింటాళ్ల వడ్లు పండించా

నాకు ఆరు ఎకరాల భూమి ఉన్నది. రైతుబంధు కింద వానకాలం సీజన్‌లో రూ.30వేలు బ్యాంకులో పడ్డాయి. గోదావరి జలాలు రాక ముందు కరెంట్ సరిగ్గా లేక ఎంతో ఇబ్బంది పడ్డా. నాకున్న ఆరు ఎకరాల్లో పొత్తుల బావి నీళ్లతో ఎకరం సాగు చేసేది. ఆ పంటకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు డబ్బులు వచ్చేవి. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన తరువాత గోదావరి జలాలు రావడం, నిరంతర ఉచిత విద్యుత్ ఇవ్వడంతో మొత్తం భూమిని సాగు చేశాను. ఈ సీజన్‌లో 100 క్వింటాళ్ల వడ్లు పండించాను. పండిన పంటను మా ఊర్లో ఐకేపీ కేంద్రంలో అమ్మాను. 2లక్షల 10వేల రూపాయలు వచ్చాయి. వారం రోజుల్లోనే నా బ్యాంకు ఖాతాలో జమ చేశారు.

– గోసుల విజయ్‌కుమార్, రైతు, బొల్లంపల్లి, అర్వపల్లి మండలం

నిలువు పందిరితో కీర సాగు

కీరకు కేరాఫ్ వైదోనివంపు

ఒకే గ్రామంలో 10 మంది రైతుల సాగు

- ఒక్కొక్కరు ఎకరం చొప్పున కీర దోస సేద్యం
- 90రోజుల్లోనే లక్ష రూపాయల ఆదాయం
- గడిస్తున్న రైతులు
- విదేశాలకు డ్రై ఫుడ్‌గా ఎగుమతి

దేవరకొండ, డిసెంబర్ 10 : దేవరకొండ మండలంలోని వైదొనివంపు గ్రామం కీర దోస సాగుకు కేరాఫ్‌గా నిలుస్తున్నది. గ్రామంలో 10 మంది రైతులు సంప్రదాయ పంటలు కాకుండా తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వచ్చే కీర సాగు చేస్తూ మంచి ఆదాయాన్ని గడిస్తున్నారు. 90 రోజుల్లోనే పంట పూర్తిగా చేతికొస్తుండగా.. ఎకరానికి లక్ష వరకు ఆదాయం వస్తున్నదని రైతులు చెప్పున్నారు.

రైతులు సంప్రదాయ పంటలు కాకుండా ఆదాయం వచ్చే పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో దేవరకొండ మండలంలోని వైదోనివంపు గ్రామంలో10 మంది రైతులు కీర దోస పంటను సాగు చేస్తున్నారు. అందుకు అయ్యే విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, పందిరి ఏర్పాటు ఖర్చు, వైరు, దారం మొత్తం గ్లోబల్ గ్రీన్ కంపెనీ సరఫరా చేస్తున్నది. 30 రోజులకు కోత మొదలై 90 రోజుల్లో పంట పూర్తిగా చేతికి వస్తుంది. కోత ప్రారంభమైన నాటి నుంచి సుమారు 25 కోతలు వస్తాయని రైతులు తెలిపారు. ఎకరం సాగు చేస్తే రూ.50వేల వరకు ఖర్చు వస్తుందంటున్నారు. గతంలో నేలపైనే పంటను వేసి కోత కోసే వారమని, ఈ సారి దిగుబడి పెంచేందుకు కర్రలతో నిలువు పందిరి వేసినట్లు చెప్పారు. పంటను కోసిన అనంతరం గ్రేడింగ్ చేస్తే కంపెనీ వాళ్లు గ్రామానికి వచ్చి కొనుగోలు చేస్తారు. గ్రేడింగ్ నాలుగు రకాలుగా ఉంటుంది. గ్రేడింగ్ వారీగా రైతులకు ధర చెల్లిస్తారు.

డ్రై ఫుడ్‌గా విదేశాలకు ఎగుమతి

తెలంగాణలో పండించే కీర దోసను డ్రై ఫుడ్‌గా తయారు చేసి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. రాష్ట్రంలో సుమారు వెయ్యి ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నట్లు రైతులకు అనుసంధానంగా ఉండే గ్లోబల్ గ్రీన్ కంపెనీ మేనేజర్ వెంకట్రావ్ తెలిపారు. నల్లగొండ జిల్లాలో దేవరకొండ, నాగార్జునసాగర్, డిండి, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి, రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు ప్రాంతాల్లో కీర సాగు ఎక్కువగా చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పండించిన కీర దోసను గ్రేడింగ్ చేసి సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్‌లో ఉన్న గ్లోబల్ గ్రీన్ కంపెనీకి తీసుకెళ్తారు. అక్కడ డ్రై ఫుడ్‌గా తయారు చేసి అమెరికా, రష్యా, ఇటలీ, ఫ్రాన్స్, కువైట్, సౌదీ అరేబియాతో పాటు మరో 15 దేశాలకు సరఫరా చేస్తున్నట్లు కంపెనీ మేనేజర్ తెలిపారు.

సాగైన కీర

90 రోజుల్లోనే లక్ష ఆదాయం వస్తుంది

నేను నాలుగు సంవత్సరాల నుంచి కీర దోస సాగు చేస్తున్నా. 90 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఎకరంలో సుమారు లక్షకు పైనే ఆదాయం వస్తున్నది. కీర సాగుకు పెట్టుబడి, విత్తనాలు, నిలువు పందిరికి అయ్యే ఖర్చు మొత్తం కంపెనీ యజమానే అందిస్తున్నారు. కోత కోసే నప్పుడు కూలీల ఖర్చు రైతులు భరించాలి. కోత కోసిన పంటను నాలుగా రకాలుగా విభజించి ధర చెల్లిస్తారు. నేను పంట వేసి ఇప్పటికి 30 రోజులు అవుతుంది. మరో ఐదు రోజుల్లో కోతకు వస్తుంది. మేము పండించిన పంటను కంపెనీ తీసుకొని పెట్టుబడులు మినహాయించుకొని మిగిలిన డబ్బు మాకు చెల్లిస్తారు.

– నల్లగాసు వీరయ్య, రైతు, వైదోనివంపు

గ్రేడింగ్ ప్రకారం ధర చెల్లిస్తాం

రైతులు పండించే కీర దోసను నాలుగు రకాలుగా గ్రేడింగ్ చేసి ఒప్పందం ప్రకారం ధర చెల్లిస్తాం. మొదటి రకం 14.5 ఎం.ఎం. సైజు ఉంటే కిలోకు రూ.36 ఇస్తాం. 18.5 ఎం.ఎం. సైజు అయితే 22 రూపాయలు, 25 ఎం.ఎం. సైజు ఉంటే రూ.12 ఇస్తాం. 32 ఎం.ఎం. సైజు ఉంటే కిలోకు రూ.4 చెల్లిస్తాం. రైతులకు విత్తనాలు సరఫరా చేసినప్పుడే గ్రేడింగ్ ప్రకారం ధరలు చెల్లిస్తామని ఒప్పంద పత్రం తీసుకుంటాం. విత్తనాలు, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్, పందిరి, కర్రలు, వైరును కంపెనీ వాళ్లు సరఫరా చేస్తారు. రైతులు పండించిన గ్రామంలోనే గ్రేడింగ్ చేసి తూకం వేసి రైతులకు పట్టీ వేసి ఇస్తాం.

– వెంకట్రావ్, గ్లోబల్ గ్రీన్ కంపెనీ మేనేజర్

పంట సాగుపై పర్యవేక్షణ ఉంటుంది

కీర సాగు చేసే రైతులకు కంపెనీ నుంచి సలహాలు, సూచనలు ఇస్తాం. పంటను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. ఏ గ్రామంలోనైనా పది మంది రైతులు ఉంటేనే సాగుకు యోగ్యంగా ఉంటుంది. మూడు నెలల కాలంలో మంచిగా సాగు చేసుకుంటే రైతులకు అధిక ఆదాయం వస్తుంది. రైతులకు ఇంత తక్కువ కాలంలో మంచి ఆదాయం వచ్చే పంట కీర. ఈ సాగు రైతులకు ఎంతో మేలు.

– నాగభూషణం, కంపెనీ సూపర్‌వైజర్

చివరి మజిలీకి చింత లేకుండా..

- అన్ని వసతులతో వైకుంఠధామం ఏర్పాటు
- చిట్యాలలో రూ.1.43 కోట్లతో నిర్మాణం
- పార్కును తలపించేలా పచ్చదనం
- ప్రశాంత వాతావరణంలో అంతిమ సంస్కారాలు
- 10 రోజుల కార్యక్రమాలకు ఉండేలా వసతులు

చిట్యాలలో నిర్మించిన వైకుంఠధామంలోని దహనవాటిక

చిట్యాల, డిసెంబర్ 10 : చివరి మజిలీకి ఎలాంటి అవాంతరాలు లేకుండా చిట్యాలలో ఆధునిక వైకుంఠ ధామాన్ని నిర్మించారు. తమ సంబంధీకుల అంతిమయాత్ర సమయంలో అవస్థలు పడకుండా ఉండటానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని పట్టణాలు, పల్లెల్లో అన్ని వసతులతో వైకుంఠ ధామాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో రూ.1.43 కోట్లతో ఆధునిక వైకుంఠ ధామాన్ని నిర్మించారు. మనిషి మృతిచెందిన రోజు నుంచి దశదిన కర్మ ముగిసే వరకు అన్ని కార్యక్రమాలను ఇక్కడే నిర్వహించుకునేలా వసతులు కల్పించారు. సొంత ఇల్లు లేనివారు, ఏ ఆధారం లేనివారు.. అవసరమైతే అక్కడే ఉండి కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకునేలా సౌకర్యాలు కల్పించారు. చిట్యాలలోని పాత శివనేనిగూడెం రోడ్డులో గల పాత శ్మశానవాటిక సమీపంలో నిర్మించిన ఈ వైకుంఠ ధామానికి వెళ్లగానే పార్కుకు వెళ్లిన అనుభూతి కలుగుతుంది. అక్కడ ఓ పర్యవేక్షకుడిని నియమించి రోజూ మొక్కలకు నీళ్లు పోయడంతోపాటు వైకుంఠ ధామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు. గేటు దాటి లోపలికి వెళ్లగానే ముందుగా యోగముద్రలో ఉన్న పరమశివుడి విగ్రహం దర్శనంతో అనుభూతి కలుగుతుంది. గేటు వద్ద నుంచి దహన వాటికల వరకు మొత్తం సీసీ రోడ్లు ఏర్పాటు చేసి, రోడ్డుకు ఇరువైపులా మొక్కలను పెంచుతున్నారు.

వైకుంఠధామంలోని వసతులు

వైకుంఠ ధామంలో వర్షం వచ్చినా ఇబ్బంది కలుగకుండా వైకప్పుతో కూడిన దింపుడు కళ్లెం, మూడు దహన వాటికల నిర్మాణం. అంతిమయాత్రలో పాల్గొనడానికి వచ్చిన వారు వేచి ఉండటానికి రెండు వెయిటింగ్ హాళ్లు, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా స్నానాల గదులు, మరుగు దొడ్లు నిర్మించారు. అస్థికలు భద్రపరుచుకోవడానికి లాకర్, దశ దిన కర్మ వరకు నిర్వహించే పూజా కార్యక్రమాల కోసం ప్రత్యేక పూజా మండపం ఏర్పాటు చేశారు. ఎలాంటి ఆధారం లేనివారు 10 రోజులు అక్కడే ఉండి సంబంధిత కార్యక్రమాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశారు. అక్కడ ఏమైనా సమస్యలు వస్తే పరిష్కరించడానికి అందుబాటులో ఓ మున్సిపల్ ఉద్యోగి ఉంటారు. అడ్మిని స్ట్రేషన్ బ్లాక్, ఓ పరమపద వాహనం కూడా అందుబాటులో ఉంటుంది.

ప్యాకేజీ విధానం తేవాలి

ఇదిలా ఉండగా వ్యక్తి చనిపోయిన సమయంలో వివిధ కార్యక్రమాలకు ఖర్చు భరించలేనంతగా ఉంటుంది. దీనిపై మున్సిపల్ పాలకవర్గంతోపాటు అఖిలపక్ష నాయకులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో మాదిరిగా ఖర్చుల కోసం ఓ ప్యాకేజీ విధానం అమలయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఏ వర్గం వారు నష్టపోకుండా అంతిమ యాత్ర ఖర్చుకు ఓ ధర నిర్ణయిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతిమ యాత్రలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలని అన్ని వసతులతో ప్రత్యేకంగా వైకుంఠ ధామాన్ని నిర్మించామని మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి తెలిపారు.

పరమపద వాహనం



వైకుంఠధామంలో యోగముద్రలో ఉన్న శివుని విగ్రహం

పార్కును తలపిస్తున్న వైకుంఠధామం

నిండుకుండలా కుక్కడం చెరువు

ఎనిమిదేండ్లుగా పుష్కలంగా నీళ్లు

జలకళతో ఉట్టిపడుతున్న కుక్కడం చెరువు

మాడ్గులపల్లి, డిసెంబర్ 10 : సీమాంధ్రుల పాలనలో చెరువులు నిరాధరణకు గురై అధ్వాన్నంగా తయారయ్యాయి. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొలువుదీరిన తరువాత కేసీఆర్ సారథ్యంలో మిషన్ భగీరథ ద్వారా చెరువుల పూడికతీత చేపట్టారు. దీంతో కాకతీయుల కాలం నాటి చెరువులు పునరుద్ధరణకు నోచుకొని నీటితో కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం చెరువులో ఎనిమిదేండ్ల క్రితం పూడికతీత పనులు చేపట్టగా.. అప్పటి నుంచి నిండుకుండను తలపిస్తున్నది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ నీటితో కళకళలాడుతూ రైతులు, మత్స్యకారులకు జీవనాధారం అవుతున్నది. చెరువు నిండుకుండలా ఉండడంతో రైతులు పుష్కలంగా పంటలు పండించుకొని హాయిగా బతుకుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువులో ఉచితంగా చేప పిల్లలను వదలడంతో మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. కుక్కడం చెరువులో నీళ్లు సమృద్ధిగా ఉండడంతో చుట్టుపక్కల నాలుగు గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు పుష్కలంగా పోస్తున్నాయి. గంధ్రవానిగూడెం, కుక్కడం, బుగ్గబావిగూడెం, మర్రిగూడెం గ్రామాల్లో సుమారు 2వేల ఎకరాల వరకు ఈ చెరువు నీటి ద్వారా రైతులు పంటలు పండించుకుంటున్నారు.

చెరువు ఎప్పుడూ ఎండిపోదు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా మా చెరువులో పూడికతీత పనులు చేపట్టింది. అప్పట్నుంచి చెరువు ఎండిపోకుండా ఎప్పుడూ నీళ్లు ఉంటున్నాయి. ఇప్పుడు మాకు సాగు నీటికి ఢోకా లేదు. ఎలాంటి ఇబ్బంది లేకుండా మంచిగా వరి పంట పండించుకుంటున్నాం.

– ఊరిబండి మల్లయ్య, రైతు, కుక్కడం